# జారుడు బండ

ఎలికట్టె శంకర్‌రావు



పడమటి రోకు కొండ మీదికి పొద్దొంగింది.
వాకిలి మొకం మీద నీడ పర్సుకుంది.

'దిక్కు తోయక యెల్లెల్కల పండుకునే కాలమొచ్చె. నిన్నేడ సదివి ద్దురా?' అన్న నాయిన మాటలు మతిల తిర్గుతుంటే నాయినమ్మ వొల్లె రోగం బుట్న కోడి పిల్లోలిగ ముడ్సుకున్న.

నేను ముభావంగా వుండటం చూసి 'వొరే పిలగా నీ మనాది బోవాల్నంటే వో కత సెపుతాయిను' అని అందుకుంది.

జీతగాండ్లు, వొచ్చిపోయేటోల్లు... గడిముంగలంతా అడావుడి.

పాపయ్యదొర కచ్చేరింట్ల కూసుండు. చెయ్యెత్తు మనిషి, చిక్కటి మీసకట్టు, దోతికట్టు... మెర్సిపోతుండనుకో. (అట్లా గాలిలోకి సూసిన నాయినమ్మ ముసిముసిగా నవ్వుకుంది)

పటేండ్లు పెద్ద పెద్ద ఆసాములతోని యవారం బెడ్తుండు. కచ్చేరింటి దర్వాజకు జారగిలబడ్డ పోశిగాన్ని చూసి 'కచ్చడం కట్నావుర' అనుకుంట దొర లేవంగనే యెన్కెమ్మటే అందరు బైటికి నడిసింద్రు.

'బాంచెన్ దొరా' పోశిగాడు పక్కకు తప్పుకుండు.

'మల్లోసారి కూసొని మాట్లాడుకుందాం' అనుకుంట దొర కచ్చడ మెక్కిండు. పోశిగాడు వురికి ముంగల పగ్గాలు అందుకుండు.

కచ్చడం కదిలింది. అలగాజెనమంతా వొంగి వొంగి దండాలు బెడ్తుంటే దొర నవ్వు మొకంతోని పలకరిస్తుండు. ఊరి బైటి మాదిగ గూడెం కాడికి పొయ్యేసరికి మాల మాదిగోల్లంత తల గుడ్డలు తీసి, చెప్పులు చేతులకందుకుంద్రు. బాంచెన్ దొర అని దండాలు పెట్టుకుంట పక్కకు పక్కకు జరిగింద్రు. అజంగ వున్న యెడ్ల అడుగులు టక్క టక్కమని పడుతున్నయ్. కుశాలగ తల్కాయలూపుతుంటె మెడలున్న గంటలు గల్లు గల్లు మంటున్నయ్.

వొందల ఎకరాల జాయిదాదు... వతను... చుట్టూ పదూల్లల్ల పేరు... ఖాందాను మొత్తానికి ఒక్కడే వారసుడు. తండ్రి నర్సయ్య దొర మొదటి భార్యకు సంతు కల్గకపోతే రెండో భార్యను చేసుకుండు. ఆమెకు కల్గిన ఒకే ఒక్క మొగ పిలగాడు దొర తోడ ఆడ పిల్లలు గూడా లేరు.

'లేదు లేదు పుట్టింద్రు గని నర్సయ్య దొర మా కర్కోటకుడు. ఒకని కాళ్ళు పట్టుకొని కన్యాదానం జేస్తానని పుట్టిన ఆడ పిల్లను పుట్టినట్లే గొంతుల్ల వొడ్లిత్తులేయించి మంత్రసాని తోసే సంపిచ్చిండని' అంటరు.

నర్సయ్య దొర కచ్చడం అలికిడికి ఆడోల్లు మొగోల్లనకుంట యిండ్లల్ల దూరి తలుపులు బిగిచ్చుకుంటోల్లు. పేరు చెప్పితే చిన్న పిల్లలు జడసుకొని వుచ్చబోసుకుంటోల్లు. దొర యెదిగినంక ముర్గం కడుపున మేకపిల్ల పుట్టిందన్నరు.

ఊరెమ్మటున్న తన పొలాలను, శల్కలను తుర్తిగ చూస్కుంట పోతుండు పాపయ్య దొర.

తాల్లబాయి కాడికి పోక శానా రోజులాయె. పొలం కోతకొచ్చిందని శేక్దారి చెప్పిండు. ఇయ్యాల కూలోల్లు కోతల కొస్తుండ్రంటే వోపాలి చూసొద్దామని కచ్చడం యెక్కిండు.

కంటిసూపు ఆనేదాంక దొర భూములే. నీల్ల వొసతున్నయ్. దగ్గెర దగ్గెర భూముల్ని సేద్యం జేపిస్తడు. తక్కిందంతా కంచె కొదుల్తడు. రొండొందల శాల్తీ పసరం అల్ల మేసేబత్తది.

వొంపుల మిట్టల్ల కచ్చడం అటు ఇటు వూగుకుంట పోతుంది.

బండి నిమ్మలంగ తీస్తుండు పోశిగాడు. గడికోపాలి దొర కల్ల చూస్తుండు. ఏదో చెప్పటానికి జంకుతుండని 'ఏందిరా పోశిగా' అని అడిగిండు.

పోశిగాడు గోశిబిగిచ్చిన కాన్నుంచి దొరకాన్నే పనిచేస్తుండు. ఆపదొచ్చినా అక్కరొచ్చినా దొరతోనే చెప్పుకుంటడు.

పతానమైనంక పెండ్లాన్ని యింటికి తోలుకొచ్చిండు పోశిగాడు. నల్లగ కుర్సగున్న యీని అకారం దానికి సయించలే. నాల్రోజులు గూడా సంసారం జెయ్యకుంట అమ్మగారింట్ల దూరింది.

'అది యెవనినో మరిగింది. అందుకే ఆటలాడుతుందని' వూల్లె జనం చెవులు కొరుక్కుంద్రు.

ఏమైందో ఏమో గని వో యేడాదికి తిప్పుకొని మల్ల మొగని కాడికి చేరింది. 'సాదుకోరా' అన్న దొర మాట యిని పోశిగాడు మల్ల సప్పుడు జెయ్యలే. అప్పటిసంది అది ఆకిలూడ్సుడు... సల్లుడు... గడిముంగల్నే పనిచేస్తుంది. దొర మాటలకు దైర్నమొచ్చిన పోశిగాడు 'బాంచన్... పోరగాని ముచ్చెట తవర్తో సెప్పుకుందావనీ...' నెత్తి గోక్కుంట గునిగిండు. దొర నవ్వుకుంట 'ఏందిరో' అన్నడు.

'బాంచెన్... పొల్లగాడు... అదే జీడికల్లు గాని సదువుకు దారి సూపిత్తరని...' పోశిగాడు బెదురు బెదురుగ చెప్పిండు.

'అట్లనా... సుబ్బయ్య దొరకు పని పోరగాడు గావాల్నని మొన్ననే చెప్పిండు. ఆడ పన్జేసుకుంట సదూకొమ్మను. నేను చెపుత'.

'బాంచెన్ కాల్మొక్త' పోశిగాని సంబూరం.

అంత పొద్దెక్కేపాటికి కచ్చడం వొచ్చి పెదమావిడి కింద ఆగింది. చుట్టూ తీరొక్క చెట్లు పెద్ద పెద్ద మానులు. పొలాలు, తోటలు. ఇంగ తాటి చెట్లకైతే అంతే లేదు. పెద్ద వొనమే. వొక్కో చెట్టు అబ్బో... చుక్కల్ని తాకుతుంటై.

అప్పటికే కూలోల్ల గుంపు చేరింది. దొర కూలంటెనే జెనం యిర్గబడ్తరు. కూలి అట్ల కొలిపిస్తడు మరి. మాట ముచ్చట లేకుంటనే దొర మీన భరోసా యేసి కోతల కొంగింద్రు కూలోల్లు.

ఇంగ దొర అట్ల చెట్ల పొంటి బడ్డడు. దొరకు శికారంటే మా యిష్టంలే. అందుకే మరి బైటికి పోయిండంటే తుపాకి లేకుంట పోడు. మాసూటి గాడులే. గుండు యిడ్సిండంటే పిట్టరాలాల్సిందే. (కత సెపుతున్న నాయినమ్మ గర్వంగా తల అటు యిటు

కచ్చడం కదిలింది. అలగా జెనమంతా వొంగి వొంగి దండాలు బెడ్తుంటే దొర నవ్వు మొకంతోని పలకరిస్తుండు. ఊరి బైటి మాదిగ గూడెం కాడికి పొయ్యేసరికి మాల మాదిగోల్లంత తల గుడ్డలు తీసి, చెప్పులు చేతులకందుకుంద్రు. బాంచెన్ దొర అని దండాలు పెట్టుకుంట పక్కకు పక్కకు జరిగింద్రు.

వూపుతుంది)

దొర శికారు చేస్కుంట ముంగల పోతుంటే యెన్కంగ పోశిగాడు పడ్డ పిట్టను పడ్డట్టు అందుకుంటుండు.

ఎండ ముదిరే సరికి పెదమామిడి కిందికి చేరిండు. ముస్తాదు లేసుకున్న గౌండ్లోల్లు దొరను చూసి దగ్గర కొచ్చింౘ్రు. దండాలు పెట్టి అట్ల దూరంగా నిలబడ్డరు.

'రేయ్! ఆ గడ్డమీది పోద్దాడు పటువ గడిల దించురి. పైటేల్ల లొట్లన్ని యాప చెట్టుకింద బెట్రి. యెండేల్ల... కూలిగాళ్లు తలాయింత మింగి సల్లబుచ్చుకుంటరు.'

గౌండ్లోల్లు తల్కాయలూపుకుంట బోయింౘ్రు. దొర గుణమే అసుంటిది. 'కష్టం చేసేటోన్ని కనిపెట్టకుంటె యెట్ల?' అంటడు.

ఇంగ దొర గుణం ఎర్గిన దొరలైతే 'అయనోన్ని కానోన్ని నెత్తికి ఎక్కించుకుంటె రేపు నీ గోశిల కొౘైతరు జాగర్త. యాడ వుండే నా కొడుకుల ఆడ్నే వుంచాలె' అంటరు.

నడెండ్దైంది. వొల్లు సుర సురంటుంది. శేక్దారిని చూసుకొమ్మని దొర కచ్చడ మెక్కిండు.

* * *

గడిముంగల యాపచెట్టు కింద వున్న కచ్చడాన్ని చూసి 'సుబ్బయ్య దొరొచ్చినట్టుందేంరా' అనుకుంట దిగిండు.

గుంపుకు గుంపొచ్చి 'బాంచెన్ కాల్మొక్త' అనుకుంట తల గుడ్డలు చేతబట్కొని నిలబడ్డరు.

'ఎవ్వలా' భుజం మీది కండువ సదురుకుంట జూసిండు.

'బాంచెన్... బాగోతులోల్లం దొర' గుంపు పెద్ద దొరకు దండం పెట్టుకుంట చెప్పిండు.

'ఏ వూౘా?'

'పడమటి బాగోతులగూడెం దొర. నాౘొచ్చి ఆడ వూరి బైట గుడ్సెలేసుకున్నం'

'అట్లనా' అనుకుంట దొర తల ఊపిండు.

ఊల్లె ఆటేస్తం దొర. తమరు సెలవియ్యాలె. పెద్ద దొరలు ఆటసెప్పాలె. మాపటికి యేశం కడ్తం' చెపుతనే వుండు గుంపు పెద్ద.

'మంచిదను'కుంట యింట్ల కల్లబోయిండు.

ఊల్లెకు బాగోతులోల్లు, శార్దకానోల్లు, పిచ్చకుంట్లోల్లు, బిచ్చగాండ్లు ఎవరొచ్చినా సరే... దొరను సూడంది పోరు. యెక్కడెక్కడోల్లో వొస్తరు. దొర ఎవల్నీ కాదనడు.

'ఏంది ఇదంత?' అని ఎవలన్నా అడిగితే 'యెట్ల బతికెటోల్లు అట్ల బతకాౘా' అంటడు.

సుబ్బయ్య దొర నడిమింట్ల కూసొని దొర్సాని తోని ముచ్చట బెడ్తుండు. దొరను సూడంగనే దొర్సాని గబగబా లోపలికి వురికింది.

'గట్లెందుకు వుర్కాల్నే నాయినమ్మా' అని అడిగిన కతల సొంతం మునిగిపోయి.

'మూసుకోరా భడవ. ముందు కత యిను' కసిరిచ్చి మల్ల అందుకుంది.

'ఎప్పుడొచ్చినవుర' బామ్మర్దిని పల్కరిచ్చుకుంట కూసుండు.

'ఇంతకు ముందే బావా' జర లేసినట్టు చేసి బదులిచ్చిండు సుబ్బయ్య దొర.

'పిల్లలు బాగున్నార? నల్లగొండల సదువులెట్ల నడుస్తున్నయ్?' దొర కుసామతు ముచ్చట్ల బడ్డడు. ఇంతల్ల పటువ, గిలాసలు తెచ్చి ముంగల బెట్టిండు పోశిగాడు. దొర గిలాసందుకుండు.

పిల్లలు సదువులకేం బావా బానే నడుస్తున్నయ్. ఎటొచ్చి పిల్లల ఆడబెట్టి యవుసాయం చూస్కోవాలంటెనే తక్లీబైతుంది. జీతగాండ్లు, కూలి నాకొడుకుల తోని సావొచ్చిందనుకో. మనిషి కదిలితే సాలు పని ఎగగొట్టి పంతుంౘు' గిలాసు కింద బెట్టి మూతి తూడ్సుకుండు సుబ్బయ్య దొర.

అన్నాలు తయారైనయని పని పిల్ల చెప్పంగనే కాల్జేతులు కడుక్కొని కూసుంౘు.

'ఇందిరమ్మ సర్కారొచ్చి దొరల దగ్గరకు నీల్లు



> 'అయినా బావా గరీబ్ గాండ్ల మీద సర్కారుకంత పావుర ముంటె పోరంబోకు భూములు యినాం భూములు పంచాలెగని తరాల నాటి మన పట్టా భూములు పంచితె యెట్ల?'

తెస్తుంది బావా' సుబ్బయ్యదొర మల్ల ముచ్చట యెల్లబెట్టిండు.

'ఏందిరో ఏమయ్యింది' యేం ఎర్గనట్టే...

'ఏమయ్యిందని నిమ్మలంగ అడుగుతవేంది బావా? సీలింగ్ తెస్తదంట. మన మొకాన యింతేసి అంతా అలగాజెనానికి పుక్కడికి పంచుద్దంట.'

దొర బొక్కను కసుక్కుంట యింటుండు.

'అయినా బావా గరీబ్ గాండ్ల మీద సర్కారుకంత పావురముంటె పోరంబోకు భూములు యినాం భూములు పంచాలెగని తరాల నాటి మన పట్టా భూములు పంచితె యెట్ల?'

దొర ఊ కొడుతుండు.

''ఎందుకైనా మంచిదని నేనైతే యింటి రాజుల పేరు మీద తలాయింత పట్టా చేయించిన బావా. ఇంత బినామీ పేర్లమీద కూడా చేయించిన. ఎక్కడిదక్కడ మట్టసంగ జేసి కూసున్ననుకో. ఇంగ ఆ చట్టమేందో వొస్తె పనికిమాలిన శల్క అంతో యింతో వొదిలి పెడ్త. ఆయింత వొదిలి పెట్టకుంటె బావుండదుగా బావా?'' కాకి సూపులు చూస్కుంట నవ్వుతుండు సుబ్బయ్య దొర.

ఇంతసేపైనా దొర గమ్మున వుండేసరికి

'ఏంది బావా సప్పుడు జెయ్యవు. అసలు ఏవన్న ఆలోచిస్తున్నవా?' అడిగిండు.

'పద్క పడేదేముందిరా? యెట్లయ్యేది అట్లయితది' లేసి చెయ్యి కడుక్కుండు.

'ఏంది బావా దొర పుట్క పుట్టి గట్ల మాట్లాడ్తన్? జాయిదాదు పోయినంక యే యెవడన్నా యింటడా? వడన్లు వుంటయా? నువ్విట్లనే నోట్లె యేలేస్కొని కూసో. ఈ అలగాజెనమే రేపు 'దొరో కూలికొస్తవా' అని పిలవకపోతే సూడు. ఏంధో నీ గుణం యెవలకు అర్థం గాదు' సుబ్బయ్య దొర నిట్టూర్సుకుంట లేసిండు.

దొర పోకడే అంత.

ఎవలొచ్చి యే సాయం అడిగినా కాదనడు. ఊల్లె యెవలింట్ల పెండ్లయినా పుస్తెబుట్టలు పంపిస్తడు. బతికినన్ని దినాలు ఒకనికి శబర జెయ్యకుంట బతకాలె అంటడు. జీతగాండ్లనైతే తిట్టినా తిడ్తడు పెట్టినా పెడ్తడు. 'ఆనికేం ఆడు దొర జీతగాడు' అని జెనం అంటుంటరు.

మాల మాదిగోల్లను కూడా ఆయన వొక్క మాటనడం యెరగడు. ఎవలన్న అన్నా అస్సలు వూకోడు. 'ఏం ఆల్లు మాౘం మన్సులు కారా?' అని యెదురు అందుకుంటడు.

సాకలోల్లు, మంగలోల్లు, కుమ్మరోల్లు... యే సాకిరి కులమైనా సరే చిన్న సూపెంచూడడు. గట్కకో, గంజికో, సల బొట్టుకో, సాయానికో గని వూల్లె యెవలైనా దొర గడప తొక్కాల్సిందే.

దొర కొడుకు యెంకౘావు సదువుకతం చేస్కొని వూల్లెకొచ్చిండు. నాల్గుదినాలకే కొలువుల షరీక గమ్మని సర్కారోల్లు కారటు పంపింౘు.

'ఈ జాయిదాదును నమ్మలేంరా పిలగా, యియ్యాలుంటది రేపు పోతది. కాలం మారుతుంది. కొలువుల జేర్తెనే బావుంటది' అని కారటు ముచ్చట ఎర్కై కొడుకు తోని అన్నడు దొర.

'దొర పుట్క బుట్టి అదునా సర్కారు కొలువు జేస్తాను' అని యెంకౘావు యెంటికతో సమానంజేసి కారటు చించి పారేసిండు.

ఇంగ అప్పటిసంది యెంకౘావు యవుసాయం చూసుకోవడం మొదలు బెట్టిండు. దొరగూడ శాతగాకుంటై కచ్చేరింట్లనే కాలం గడుపుతుండు.

* * *

ఓనాడు పొద్దున్నే గసబెట్టుకుంట పోశిగాడు వురికొచ్చి 'దొరా... దొరా' అని యింటి ముంగల్నే నిలబడి కేకలేస్తుండు. దొర్సాని బైటికి పోయి 'ఏందిరా?' అని అడిగింది.

దొర్సానీ! నాౘ వూరి బైట మీటింగు బెట్టింౘంట తాల్లబాయికాడ, నడింబాయికాడ, కంచెల యాడబడ్తె ఆడ జెండాలు పాతింౘు' పోశిగాడు గుక్క తిప్పుకోకుంట చెప్పిండు.

దొర్సానికి తల తిరిగినట్లయింది. ఒక్కసారిగా దిగజెమటలు బట్టినయ్. మొదటిసారి వొల్లు జెంకినట్లయింది. పట్టుపట్టుమని దొర ఇయ్యాల్నే పట్నంబాయె అని ఒగటే తొక్కులాడింది.

తెల్లారి దొర రాంగానే యెన్నడు యెదురుబడని దొర్సాని ఆదల బాదలగ యెదురుబోయి 'దొరా యీ ముచ్చట యెర్కయిందా? జెండాలు పాతింౘంట' గుడ్లల్ల నీల్లు తిర్గుతుంటే జెప్పింది.

దొర మాౘం నిమ్మలంగ కూసుండు.


సీలింగ్ యాక్టొచ్చి వూడ్సుకపాయె. ఉన్న గింత జెండాలపాలైతుండె. ఇంగెట్ల అని దొర్సానికి దిగులుబట్టుకుంది.

'ఏంది గట్లుంటరు? గింత జర్గుతుంటె చీమకుట్టినట్లు కూడ లేదు మీకు'అని దొర్సాని పరేశానుగ అడిగింది.

'మేము ఏం ఉబ్బాయించినం. రొండుచేతుల మూస్కొని కాల్లు బార్లా సాపి కూసున్నం.

(మిగతా 12వ పేజీలో)

# అసలే కరిరాజు.. ఆపై స్థూలకాయం!



స్థూలకాయం ఇదివరలో మనుషులకు మాత్రమే పరిమితమయ్యేది. అయితే కొంతకాలంగా ఇది జంతువులకూ సోకింది. విపరీతమైన తిండితింటూ, శరీర శ్రమకు దూరంగా ఉండే వారికి స్థూలకాయం ఏర్పడుతుంది. ఇందువలన శరీరం అనేక రుగ్మతలకు గురవుతుంది.

కొన్ని సంవత్సరాల నుంచీ స్థూలకాయం వలన ఏనుగులు ఎంతో అవస్థ పడుతున్నాయి. మైసూర్‌లోని నంజన్‌గూడ్ అనే ఊళ్ళో ఒక దేవాలయం ఉంది. ఆ గుడికి అవసరమైన సేవలకు గౌరి అనే ఏనుగు తోడ్పడుతోంది. 22 సంవత్సరాల వయస్సుగల గౌరి సుమారు 3సంవత్సరాల నుంచీ అధిక బరువుతో బాధపడుతోంది. 5 టన్నుల బరువుగల ఆ కరిరాజును చూడడానికి రోజూ నంజన్‌గూడ్ దేవాలయానికి వందలాది మంది భక్తులు వెళ్తూ ఉంటారు. దైవదర్శనం పిమ్మట వారంతా గౌరి చుట్టూ చేరి, దానికి రకరకాల ఆహార పదార్థాలు అందిస్తారు.

గౌరిని ఉంచిన ప్రదేశానికి ముందుభాగంలో దేవాలయం అధికారులు ఒక బోర్డు ఉంచారు. దానిపై "అరటి పండ్లు, బెల్లం, చెరుకుగెడలు ఏనుగుకు ఇవ్వకండి!"అని వ్రాసి ఉంది. ఆ బోర్డును చూసినప్పటికీ అక్కడ గుమిగూడే జనం -దానికి పండ్లు, ఆహారం అందిస్తూనే ఉంటారు.

గౌరి సంరక్షకుడైన మావటి, రోజూ దానిని 6 కిలోమీటర్లు దూరం నడిపించుకు వెళ్తాడు- ఎక్సర్‌సైజ్ లభించడంకోసం. గౌరి నడిచే 6 కిలోమీటర్ల దూరంలో అనేక మంది దానికి పండ్లు, తినుబండారాలు అందచేస్తూనే ఉంటారు. ఇందువలన దాని 6 మైళ్ళ ఎక్సర్‌సైజ్ వృధా అవ్వడమేకాక, అది మరింత లావుగా అవుతోంది. మావటి ఎంతగా చెప్పినా జనం గౌరికి ఆహారం ఇస్తూనే ఉంటారు.

17 సంవత్సరాలుగా జాన్ గౌరికి మావటిగా ఉన్నాడు. రోజురోజుకు దాని శరీరం లావు అవ్వడం చూసి అతను బాధపడుతూ ఉంటాడు. ప్రతీరోజూ నంజన్‌గూడ్‌లోని దేవాలయానికి సుమారు 500 మంది జనం వెళ్తూ ఉంటారు. గౌరిని చూడగానే వారికి వినాయకుడు స్ఫురణకు వస్తాడు. గణేశుని అవతారమే ఆ గజరాజు అని వారి నమ్మిక.

మన దేశంలో అడవులలో బంధించబడిన 2వేల వరకూ ఏనుగులు- వివిధ రకాల పనులకు వినియోగించబడుతున్నాయి. వీటిల్లో ఇంచుమించుగా అన్నీ స్థూలకాయంతో బాధపడుతున్నవే!

దేవాలయాల్లో ఉండే ఏనుగులు గొలుసులతో బంధించబడి ఉంటాయి. రోజు భారీగా వాటికి ఆహారం లభిస్తుంది. ఏ పనీ చెయ్యకుండా అవి స్తబ్దుగా ఉంటాయి. శారీరక శ్రమ లేకపోవడంవలన అవి స్థూల కాయానికి గురవుతున్నాయి.

కేరళలో వున్న 600 ఏనుగులలో కొన్ని దేవాలయాల్లో సేవలు చేస్తున్నాయి. మరికొన్ని వ్యాపారస్తుల వద్ద బరువులు మోసే పనుల్లో ఉన్నవి. అవి ఉండే ప్రదేశాలన్నీ అనారోగ్యానికి నెలవులు. రకరకాల వ్యాధులతో బాధపడుతున్న ఆ కరి రాజుల గోడు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

జర్మనీకి చెందిన డ్రెడ్‌కర్ట్ అనే సైంటిస్ట్ ఇలా అన్నాడు.

"ప్రపంచంలోని 48శాతం ఏనుగులు స్థూలకాయంతో బాధపడుతున్నాయి. భారతదేశంలోని ఏనుగులకన్నా, కొన్ని విదేశాల్లోని ఏనుగుల పరిస్థితి అతి ఘోరంగా ఉంది. అచ్చటి అతి చల్లటి వాతావరణం వలన ఏనుగులు పూర్తిగా నడకకు దూరమై, స్థూల శరీరానికి దగ్గరయ్యాయి."

ఏనుగులకు ప్రత్యేకమైన వైద్యం చెయ్యడంలో పేరుపొందిన డాక్టర్ కె.సి.ఫణీశ్వర్ గౌరి విషయంలో ఇలా అన్నారు.

"గౌరి చేత హెచ్చుగా ఎక్సర్‌సైజ్‌లు చేయించాలి. దానికి అన్నం, రాగులు మాత్రమే ఆహారంగా ఇవ్వాలి. బెల్లం, చెరుకుగెడలు, అరటి పండ్లు ఇవ్వకూడదు. ఇప్పటికే గౌరిలో స్థూలకాయంవలన కొన్ని రుగ్మతలకు గురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వాటిని నిరోధించడానికి చర్యలు తీసుకోవాలి!" త్వరలోనే ఆ కరి రాజుకు స్థూలకాయం తగ్గి, ఆరోగ్యం చేకూరుతుందని ఆశిద్దాం!

**-కొడిమెల**

(9వ పేజీ తరువాయి)

సర్కారోనితోని శెర్తు చేయొచ్చుగని యీ జెండాలోంతోని వోడు బెట్టుకుంటడు. పానం మీదికి తెచ్చుకునుడేగని' పోయిన యెండాకాలంల జెండాలు పాతినపుడు తన తమ్ముడు సుబ్బయ్య దొరన్న మాటలు యాదికొచ్చినయ్ దొర్సానికి.

'గాశారం బాలేనపుడు గడప పట్టుకొని యాలాడ్తె ఏమొస్తదని' వూకుంది.

ఓ సందకాడ యెప్పటోలిగనే యింత తిని కూసుండు దొర. మాట్లాడుకుంట మాట్లాడుకుంటనే కుప్ప కూలిండు. మల్ల లేవలె. రావయ్యగార్ని పిలిపిస్తే నాడి చూసిండు గాని ఏముంది? అప్పటికే వొల్లు సల్లబడి కట్టె సరిసిండు. (కత చెపుతున్న నాయినమ్మ కండ్ల పొంటి బొట బొటామని నీల్లు కారినై. పైట కొంగుతోని కండ్లొత్తుకుంది)

దొరబోయినంక యింటికల తప్పె. ఎవన్ని మందలిచ్చేయాల్ల లేకుంటాయె. ఇన్నాల్లు బాంచెన్ దొర అనుకుంట తిర్గినోల్లంత దూర దూరంగ తిర్గడం మర్గిరి. వొరేయ్ తురేయ్ అన్న నోటితోనే ఎల్లాయ్ పుల్లాయ్ అనేకాలమొచ్చె.

ఎక్కడిదక్కడ పోంగ వున్నగింత యవుసాయం జేస్తందకు వో జీతగాన్ని కుదిరిచ్చుకుండు యెంకట్రావు. ఎద్దడి యవుసాయాలకు ఏం మిగుల్తది? కలుపుగూల్లు, పెట్టుబల్లు, జీతాలు పోను ఏం మిగుల్తది పాడు? రొండేండ్లల్ల యవుసాయం మీద అప్పుదేలడం మొదలుబెట్టె.

ఓ పక్క గడి పడావుబడి జిల్లేడ్లు మొలిసె. పాతం చేస్కునే తడిలేకుంట పాయె. ఇంగ లాభం లేదని గడి వొదిలి పెట్టి నాలుగర్రల రేకులేసుకోవాల్సొచ్చె.

ఆడ పిల్లల పెండ్లిల్లు, పురుడ్లు ఏ కర్సు లాగుతై. కడరోకున్న భూములన్ని కర్సుల కింద కరిగిపాయె. ఇంగేముంది చూస్తుండగనే పిడకలగూడు కూలినట్టు గూలె బతుకు.

ఇంగ ఈపాటి యవుసాయానికి జీతగాండ్ల నేడ బరాయిస్తమని అలవాటు లేని పానమైనా యెంకట్రావు మేడిపెట్టె.

గాశారం పాడుగాను నెత్తిన కూసునె. కాలం కచ్చగట్టె. బావులు వొరుగులాయె. బోర్లు కుచ్చీ కుచ్చీ వొల్లు యిల్లు గుల్లాయె. బతుకు రెక్కలిర్సి నట్టాయె. చూస్తుండగనే కూటికి సచ్చేరోజులు దాపురించె.

నాయినమ్మకండ్ల పొంటి కట్టలు తెగినట్టె. దారలు కారుతున్నయ్. దుక్కానికి మనిషి కదిలిపోతుంది.

'ఒసే ముసల్దానా! నా సెవుల పూలు బెట్టి మనకతే చెపుతావె' అని మన్సుల అనుకొని అయినా ఏం చెప్తుద్దో చూద్దామని జర నిమ్మలబడ్డంకొ తర్వాత కతేందే నాయినమ్మా'అని యేం యెర్గనట్టు అడిగిన.

అంతల్లనే పట్నం బోయిన మా నాయిన యెంకట్రావు కాల్లీడ్సుకుంట వొచ్చి నులక మంచంమీద వొరిగిండు.

'ఒరే గుంజగా! కతనీకర్థమైందని నాకు తెల్సురా' అన్నది నాయినమ్మ. మొకంల రంగు మారిపోయింది.

'ఏమైతది బిడ్డా! యిగో గిట్లయింది' అని తల పట్టుకొని పండుకున్న కొడుకును. తన చేతుల కున్న తెల్లగా జుల్ను చూపింది.

అప్పుడు... పసుపు కుంకుమల కింద తెచ్చుకున్న రొండొందల తులాల బంగారం నాయినమ్మ కండ్లల్ల కరిగి బొట బొట మని రాల్తున్నట్లనిపించింది.

మాట ముచ్చట లేకుంట పండుకున్న కొడుకుని చూసి 'ఏందిరా యెంకయ్య అట్లున్నవ్' అని అడిగింది నాయినమ్మ.

నాయిన గొంతులో గడ్డకట్టిన దిగులు జాలువడ్డది.

'అమ్మా దొర్లింట్ల పుట్టిన రవిగానికి సర్కారు కొలువు యెట్లాగూ రాదు. ఆడు యేదో వోటి కానిగిరి పని చెయ్యకుంటె యిల్లెల్లదు. అందుకనె అన్ని రాములు కాడికి పంపుదామనుకుంటున్న' గొంతు జీరబోతుంటే చెప్తుండు.

'ఆయనెవల్రా' నాయినమ్మ ఆరా తీసింది.

'మన పోశాలు కొడుకు జీడికంటి రాములమ్మా, పెద్ద ఉద్యోగంలో ఉండు'. 'ఆయన మిత్రుడు పట్నం శివార్లలో తోటలు కొన్నడంట. తోటలు సూసుకోవటానికి మన్సికావాల్నని చెప్పిండట' నాయిన కాటు బడ్డట్టు నిట్టూర్చిండు.

'కత అయిపోయిందిరా పిలగా' పగిలిన శత్వారం అద్దాలు సరిజేసుకుంట తారాడుతుంది నాయినమ్మ.

పొద్దు సొంతం కడుపుల బడ్డది. చిమ్మ చీకటి కమ్ముకుంది. ★